కథానిక:

# ఇంగువ కట్టిన గుడ్డ

## "మోహన్"



"ఓయ్, నిన్నే"

"అబ్బా ఉండండీ, ఏదో మహారాచకార్యం మునిగిపోతున్నట్లు ఎందుకల్లా గొంతు చించుకుంటారు?'

'ఏమిటా తలబిరుసుతనం ఒక్కసారి వచ్చి పొమ్మంటే'

'చెయ్యిఖాళీగా లేదు, ఏంపనో అక్కణ్ణుంచే చెప్పరాదూ?'

"తీరిక అంటూ నీజన్మకి ఏడ్చిందేం? ఇప్పటికే తొమ్మిదైంది గుప్పెడు మెతుకులు పడేస్తే వెళ్లిపోతాగా"

'ఆఫీసరుగారిక్కి టైం మించిపోతుంది కామోసు ఇంకా కుంభం దిగలేదు ఆవళ్లేదేమి — దయచేసి వెంటనే తిరిగిరండి"

ఒకుభగుమంది ఇంతకూ నలుగురితో బాటు ఒక ఉద్యోగం సంపాదన అంటూ లేకపోబట్టేగా దీనికి ఇంతలోకువ అలుసూను అయినా తిండికి బట్టకులోటు లేకపోయిన తర్వాత నేనెట్లాతిరిగితే తనకేం? తన పనేమో తాను చూసుకోరాదూ? అహా, కాదు "లింగు లిటుకూమంటూ ఈనాడు ఇద్దరమే కనుక నాటకం ఆడుతున్నారు రేపు పిల్లలంటూ పుట్టింతరువాత ఎట్లా అని ఎన్నడైనా ఆలోచించారా? ఉన్నదాన్ని ఆర్పుకుతింటూ బలాదూరు తిరిగితే సరిపోతుందా ఏం? "అంటుంది మా శ్రీమతి అవును, నిజమే సంసారంలో దాని విధి అది చక్కగా నెరవేరుస్తున్నది మరి నేనో? ఈసడించుకున్నదంటే తప్పు దానిది కాదు

వెంటనే నిశ్చయించుకున్నా, తిరి ఎక్కడైనా ఒక ఉద్యోగం అంటూ లేకుండా ఇంటిగుమ్మం తొక్కరాదని పట్టుదలతో బయలుదేరాను మొన్ననే తెచ్చిన నాల్గుబస్తాల ధాన్యం వందరోజులం ఇంట్లో ఉన్నాయి గనక ఇంటావిడకు భోజనం ఎట్లా అనే దిగులు లేదు ఇంటి పక్కన మా మామయ్య, అత్తఉన్నారు తోడుకి

కాళ్లు స్టేషనుకు దారితీస్తున్నాయి మెదడు గత జీవితాన్ని నెమరు వేస్తున్నది, ఎక్కడకు పోవటమా అన్న ప్రశ్నకు జవాబుకోసం

లేనికుటుంబం కాకపోయినా శ్రీమంతులక్రింద జమరాము ఏడాదికి దాదాపు అరవెయ్యి దాకా అయివేజువస్తుంది

(20-వ పేజీ చూడండి)

# ఇంగువకట్టిన గుడ్డ

(8-వ పేజీ తరువాయి)

రైతులు బకాయీలు లేకుండా మక్తాలు ఇస్తే ఇంట్లో రెండుగేదెలపాడి కాలం నిశ్చింతగా గడిచిపోతున్నది

హైస్కూలు పంచాంగం రెండుసార్లు పట్టీకొట్టించిగాని చంక కెక్కలేదు మొదటి యాత్రకుపూర్వమే ఒకసతీమణి అంటూ ఏర్పడటంతో రెండోపట్టీ ఖాయంఅయింది అర్థాంగిగారి ఈ సణింపులకో బుర్రబిరుసెక్కి లోపలకుజారిన రెంగుముక్కలనూ బైటకు పోకుండాఆపి మూడోసారి గట్టెక్కించింది కాలేజీగేట్లను, మొదట పట్టీతోనే బహిష్కరించాం గనుకనున్నూ నౌకరీచేసేగతి నాకేం పట్టిందని ఇదివరకే తీర్మానించుకున్నాంగనుకనున్నూ, రాజకీయాలలో ముసలిరక్తం వదొలిగి యువకరక్తానికి తావివ్వాలనే వాదనను అంగీకరించాం గనుక నున్నూ దేశభక్తుడు అనిపించుకునే ప్రతివాడికి ఆదర్శాలుగా ఉండే అనేకములైన వాటిలో గ్రామోద్ధరణ మహా తేలికగ్గా, చౌకగా, అందుబాటులో ఉన్నట్లు కనబడుటవలననున్నూ, మా శ్రీవారితోసహా మాఊరిలో మకాం స్థిరంచేశాను

ఐదారు సంవత్సరాలు నిర్విఘాతంగా సాగినఇంజను డ్రైవరుకు తెలియకుండానే బ్రేక్ పడ్డది ఖాళీబ్రేక్ పడితే అంత తికమక ఉండకపోను బండి వెనక్కు నడవటంతో గాభరా ఎక్కువైంది క్రితసాలువరకూ, ఏ అడ్డంకీ లేకుండా మక్తాలు చెల్లించిన రైతులు ఈనాడు ఎగనామం పెట్టారు రైతుజనాభ్యుదయ కాముకులము, దున్నేవాడిదేభూమి అని వాదిస్తూ వచ్చాం గనుక ఈనాడు మక్తాలు తగ్గింపు లేకుండా కట్టి తీరవలసిందేనని గట్టిగా పట్టు బట్టటానికి నైతికమైన ఇబ్బందికి లోనుకావలసివచ్చింది, కనీసం ప్రభుత్వంవారు బకాయీలను ఇప్పించేవరకు ఇంతవరకూ వారి హక్కులకై పోరాడిన, కనీసం వారి ముందు ఇతరులతో వాదించిన మనకు గూడా మక్తాలు ఇవ్వరా అనే ధైర్యం ఉండేది ఇది కాకుండా మరా రాజకీయాలలో ఎదురుపార్టీ వారిద్దరికి ధాన్యం కొలవవద్దని రైతుల్ని ముందాలోచన లేకుండా ప్రోత్సహించాను కూడా ఈనాడు నేను తవ్వుకొన్న గోతిలో నేనే పడ్డా గింజలంటూ ఇంటికిజేరితేనేగాని గడవని సంసారం మరి

కాళ్లు ముడుచుకు కూర్చుంటే ఏమయినట్టు అన్నప్రశ్న ప్రత్యక్షమైంది కనీసం ధాన్యం ఇంటికి చేరేవరకైనా నాటకం ఆడాలా? స్కూలు విడిచి పదేళ్ళయినా ఇప్పటివరకూ ఉద్యోగ ప్రసక్తే దగ్గరకు జేరనివ్వని నాకు ఈనాడు ఉద్యోగం ఎవరుఇస్తారు? పోనీ పల్లెపట్టుగదా, నలుగురి పిల్లలకు ఓనమాలు దిద్దపెట్టుకుందామా అంటే మన పాండిత్యం లోకవిదితం ఒకర్ని ఆలోచన అడుగుదామా అంటే ఇంతవరకు ఒకరికి సలహాచెప్పిన ధీశాలులం మనకు ఆత్మాభిమానం అడ్డొచ్చింది పైగా భుక్తిమార్గానికే ఒకర్ని సలహా అడగొచ్చేటప్పటికి చచ్చినంత పనైంది

ఇంట్లో శ్రీవారి గొడవ ఆరోజు కారోజు ఎక్కువైంది దమ్మిడీ సంపాదన లేదన్నమాట నిజమే కాని ఆమాటనే చెసుకొన్న పెండ్లాం రోజుకు ఇరవైసార్లు దెప్పి పొడుస్తుంటే భరించటం కష్టమయింది నేను ఎక్కడ తిరిగినా, ఎందుకు తిరిగినా, అన్నీ ఆరాలు తనకు కావాలి నాకు స్వతహాగా తెలివి తేటలు సూన్యమని, ప్రతివిషయంలోను తన సలహా నేను పాటించాలని ఆవిడగారి పాయింటు కాని భార్యారత్నంగారి సలహాప్రకారం నడుచుకుంటుంటే ఏనాటికైనా నికార్సైన పత్నీవ్రతుణ్ణనే పేరు పొక్కిపోతుందనే భయం ఒకమూల పీడిస్తుంది అయినా ప్రతిదానికి ఆడదాని సలహా ఏమిటన్న పురుషకారం ఒకటంటూ ఉంటంతో మా ఇంటావిడతో ఏ విషయంగూడా సంప్రదించే అలవాటు చేసుకోలేదు

ఇన్ని కారణాలుగా పట్నం జేరవలసి వచ్చింది అప్పట్లో ఆవూళ్ళో వేలువిడిచిన మేనమామ అంటూ ఒకరు లేకపోతే ఏమయ్యేదోగాని అప్పుడు మాత్రం ఒక సంపాదన పరుణ్ణయ్యాను నెలకు అరవైరూపాయల జీతం తిండీ బట్టా జరిగిపోతున్నాయ్ వచ్చిన మక్తాగింజలు వెనుక వేసుకున్నాను

రోజులు ఆవిధంగా తోసుకొచ్చాయి రాజకీయ ప్రవేశం ఒక నిషాలాంటిదని ఆనాడు గ్రహించగల్గాను ఈముఖ్య సంసారం ఎట్లా జరుగుతుందా అన్న తాపత్రయంలో మగ్గునపడ్డ రాజకీయ విషయ చర్చా వాంఛ తిరిగి ఉద్యోగంలో చేరిన తరువాత తలెత్తింది పార్కుల్లో నలుగురిలో వాదించటంతోనే అప్పట్లో తృప్తిపడ్డా నేను ఒక తీవ్రవాదిననేపేరు సంపాదించుకున్నాను ఈబిరుదు ఆనోటా ఆనోటాపడి మా మేనేజరువరకూ వెళ్లింది చెడ్డరోజులు వస్తే ఆపటం బ్రహ్మతరమా

అని తరువాత జరిగిన మాకంపెనీ సమ్మెలో మనకు ఈషన్మాత్రం జోక్యంలేక పోయినా ఉద్యోగంమాత్రం రక్షిమని ఊడింది ఆ తర్వాత ఈనాటివరకూ నేను ఎక్కని ఆఫీసుగుమ్మం అంటూ లేదు, ఉద్యోగ నిమిత్తం పాపం, మా మామయ్యకూడా శతవిధాల ప్రయత్నించాడు కాని ఫలితం లేకపోయింది

"అంటే ఇక మీరు ఉద్యోగం చెయ్యరన్నమాట" అంగుకుంది మాఆవిడ ఒక మంచిరోజు చూసి

"చెయ్యనన్నానుటే, నీ పిచ్చికాని, రోజులు కలిసిరావాలి"

ఉన్నదాన్ని నిలపెట్టుకున్నారు, ఇక రాబోయేదాన్ని వెలగపెడతారు అయ్యో గీత! పూజకొద్దీ పురుషులు! ఇదేచెప్తున్నా, ఈరోజునుండి ఒకపూట వంటమీది

అదైనా నేర్చుకోండి మాకక్కయ్యగారు భార్యని పురిటికి పంపిస్తాడట వంటమనిషి కావలసిఉంటుంది ఏదో ఒక ఉద్యోగం" అని తేల్చేసింది

ఈముల్లుపోటు మంథర పర్వతమై నాహృదయజలధిలో మథనం ప్రారంభించింది ముందుగా గృహపరిత్యాగం అనే హాలాహలంలో మునిగిపోయ్యాను ఇక మీదైనా అమృతప్రాప్తి ఉందో? ఉంటే, ఎటువంటిదో? ★

